గుర్నాధం కోపంతో వూగిపోతున్నాడు.

ముక్కుపుటాలు ఎగిరిపడుతున్నాయి.

అక్కడ చేరిన జనాలకి ఆయన్ని చూస్తే బాధేస్తోంది.

పాపం గుర్నాధంకి ఈ వయసులో ఎంత కష్టం వచ్చింది...? అనుకొన్నారు.

"దేవుడులాంటి యీయనకి అన్యాయం చేసినోళ్ళు వూరకే పోరులే" అంటూ మెటికలు విరుస్తున్నారు అక్కడ చేరిన ఆడోళ్ళు.

గుర్నాధంకి యివేవీ పట్టడంలేదు.



కథా నిలయం
శ్రీకాకుళం

# ప్రజాతీర్పు

**బెండపూడి రమేష్‌బాబు**

చుట్టపొగ గుప్పుగుప్పున వొదుల్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఎందుకు యిలా జరిగిందో ఎంతాలోచించినా అర్థంకావటం లేదు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందని మాత్రం అర్థమవుతోంది. ఆ పొరపాటు ఏమిటో ఎంతకీ అవగాహన కావటం లేదు. ఆయన వాలకం చూసి ఆయనతో మాట్లాడే సాహసం ఎవ్వరూ చేయలేకపోతున్నారు.

చివరికి ఎలాగో ధైర్యంచేసి "జరగాల్సిన నష్టం జరిగిపోయిందయ్యాగారూ. ఎంతాలోచించి మాత్రం ఏం ప్రయోజనం చెప్పండి? తమరు గుండెనిబ్బరం చేసుకోవాలి బాబయ్యా" అంటూ ఓదార్చసాగాడు నారాయణ.

దీనికి అంతటికీ కారణమైన వాడివైపు విసురుగా చూసి, చుట్ట నేలకేసి కొట్టాడు కసిగా. జనం కూడా గుర్రుగా చూసారు వాడివైపు.

గుర్నాధంకి అరవైఏళ్లుంటాయి. వినుకొండ దగ్గర ఓ పల్లెటూరు ఆయనది. పిల్లలందరికీ వివాహాలు చేసేసాడు. అతనూ, అతకి భార్య సీతమ్మ తప్ప ఏ బాదరబందీ లేని సంసారం. చుట్టుపక్కల గ్రామాల్లో ఆయనకి మంచి పేరుంది. అది వంశపారంపర్యంగానో... ఏ ఘనకార్యమో సాధిస్తేనో రాలేదు. కేవలం అతను నిర్వహించే చౌకదుకాణం ద్వారా వచ్చింది. ఆ చుట్టూ గ్రామాల్లోని బీద, బిక్కీ జనం హాయిగా, ప్రశాంతంగా తిండీతిప్పలకు ధోకా లేకుండా బ్రతికేస్తున్నారంటే గుర్నాధం నిర్వహించే చౌకడిపో పుణ్యమే.

జనం చేతిలో డబ్బుల్లేకపోయినా మానవతా దృక్పథం అంటూ వాళ్ల అవసరాలు తీర్చేవాడు. డబ్బుల కోసం వత్తిడి చేసేవాడూ కాదు. వున్నప్పుడు వాళ్లే యిస్తార్లే అనుకొనే మనస్తత్వం.

"యిట్టా చేస్తే తమరి వ్యాపారానికి లాభం ఎట్టా వస్తదయ్యా" అని నారాయణ అప్పుడప్పుడూ అడ్డుపుల్ల వేయబోయినా...

"నారిగా... ఎంత అవసరం వుండి అడుగుతున్నారో... మనం ఏమన్నా కట్టుకపోతామా... చెప్పు..." అంటూ సర్దిచెప్పేవాడు నారాయణకి.

అయిన వాళ్లెవ్వరూ లేకపోవటంతో చిన్నప్పట్నించీ గుర్నాధమే వాడి మంచీచెడూ చూసేవాడు. తనకి పెద్దతనంలో చేదోడు వాదోడుగా వుంటాడనీ, చౌకడిపోలో పనికి తోడుంటాడనీ భావించాడు.

పంచాయితీ ఎన్నికలు ప్రకటించింది ప్రభుత్వం.

అదే తన జీవితంలో పెనుతుఫాను సృష్టించబోతోందని తెలియదు ఆ క్షణంలో గుర్నాధానికి.

ప్రజల్లో ఆయనకు వున్న పలుకుబడీ, ఆదరణా చూసి వివిధ రాజకీయ పార్టీల వాళ్లు ఎవరికివారే తమ పార్టీ తరపున పోటీ చేయ

మని వొత్తిడి చేయసాగారు.

'యీ వయసులో రాజకీయాలు ఎందు కులే?' అని సున్నితంగా తిరస్కరించాడు. యీ వార్త దావానలంలా గ్రామంలో పాకింది.

ఏదో ఒక రాజకీయ పార్టీ తరపున పోటీ చెయ్యమన్నారు జనం. తను అందరికీ కావా ల్సిన వాడిననీ, అన్ని పార్టీల్లో తనకు మంచి మిత్రులు, శ్రేయోభిలాషులూ వున్నారనీ... కనుక పోటీ చేయనని అన్నాడు.

నారాయణకి మాత్రం అయ్యగారు పోటీ చేస్తేనే బాగుంటుందనిపిస్తోంది.

అందుకే వివిధ రాజకీయ పార్టీల్లో వున్న నాయకుల వయస్సుల్ని గణాంకాల్తో సహా వివ రించి చెప్పాడు. వాళ్లకంటే మీ వయస్సేం ఎక్కువ కాదన్నాడు. మీలాంటి చదువుకున్నో ళ్లు... ధర్మప్రభువులూ పోటిచేసి గెలిస్తేనే న్యా యంగా వుంటుంది అన్నాడు. తమరు కాకపోతే ఏ దొంగనాయలో పోటీచేసి... గెల్చి ప్రజల గోడు వినిపించుకోడు అన్నాడు.

ఆ మాటలు ఆయన్నేం కదిలించలేక పో యాయి.

అయినా పట్టువొదలని విక్రమార్కుడిలా ప్రజల్ని పోగేసి వాళ్లచేత చెప్పించాడు. గుర్నా థం ఆలోచనా విధానంలో మార్పురాసాగింది.

ప్రజలు చూపిస్తున్న ఆదరణ ఆయన్ని వుక్కి రిబిక్కిరి చేస్తోంది. నారాయణ చేస్తున్న హడా వుడి ముచ్చటేసింది. ఏ రాజకీయ పార్టీ తరపున పోటీ చెయ్యాలో అతనికి అర్థం కావడంలేదు. అదే విషయాన్ని జనాలకి చెప్పాడు.

అక్కడ పోగైన జనం వారివారి అభిప్రా యాలు చెప్పారు.

"ఓ... పన్జేస్తే...' అన్నాడు నారాయణ జనా న్ని వుద్దేశించి.

అందరూ అతనివైపు చూసారు ఏందన్న ట్లు...

వాడు చెప్పుకుపోసాగాడు.

"అధికార పార్టీకి ప్రజల్లో నమ్మకం సడలిం దనీ, ప్రతిపక్షాన్ని జనం నమ్మేస్థితిలో లేరనీ... కాబట్టి అయ్యగారిని యిండిపెండెంటుగా పోటీ కి నిలబెడదామనీ... అప్పుడు ఏ పార్టీ వాళ్ల తోనూ మొహమాటం వుండదూ; పైగా అయ్య గారికి జనంలో బలమెంతవుందో వాళ్లకీ తెలు స్తుందనీ..." అన్నాడు.

వాడి రాజకీయ పరిజ్ఞానానికి ముచ్చటే సింది గుర్నాథంకి.

జనం ఏకగ్రీవంగా ఆమోదించారు వాడి ఆలోచన్ని.

గుర్నాథంకి పోటీచేయక తప్పందికాదు.

ఎన్నిక లాంఛనమే... గెలుపు నల్లేరుపై నడకే అన్నారు జనం.


భారీ జనం తోడురాగా ఇండిపెండెంటుగా నామినేషన్ వేసాడు గుర్నాథం.

పార్టీల్ని నెగ్గుకొని గెలవగలనా? అని బెంగ పట్టుకొంది.

అదే విషయం నారాయణతో అన్నాడు.

"అయ్యగారూ... వైయస్సార్‌లా పాద యాత్రలు చేయండి... ఓట్ల వర్షం అదే కురు స్తుంది..." అన్నాడు.

వైయస్సార్‌లా పాదయాత్రలూ... ఎన్టీవో డిలా రోడ్డు పక్క స్నానాలూ... భోజనాలూ చేసాడు.




జనం బ్రహ్మరథం పట్టారు... హారతులు యిచ్చారు... కాళ్ళు కడిగారు. కొబ్బరి కాయలు కొట్టారు... సాష్టాంగ నమస్కారాలు చేసారు. భాజాభజంత్రీలతో వూరేగించారు.

ప్రజలకు తనపై వున్న అభిమానానికి కరిగిపోయాడు గుర్నాధం.

అపోజిషన్ పార్టీవాళ్లు కూడా గెలుపుపై ఆశలు వొదులుకొన్నట్లే కనిపించారు.

నారాయణ ఎప్పటికప్పుడు సర్వే రిపోర్ట్ అందించసాగాడు.

వాడి సర్వే ప్రకారం గెలుపు ఖాయం అన్న భావన కలిగింది గుర్నాధంకి. తిండీతిప్పలూ మానేసి రాత్రింబవళ్లూ నారాయణ పడుతున్న శ్రమకి హృదయం ద్రవించిపోయింది గుర్నాధానికి. ప్రచారం హోరెత్తిపోయింది.

పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఓటింగ్ సరళి చూసాక ఎవరి లెక్కల్లో వారున్నారు.

నారాయణ కూడికలు, తీసివేతలు, భాగాహారాలూ చేసి "గెల్చేది మా అయ్యగారే" అని డిక్లేర్ చేసేసాడు.

గెల్చిన తర్వాత జరపబోయే సంబరాల్లో బిజీ అయిపోయాడు నారాయణ. ఎన్నికల ఫలితాలు తెలిసాయి.

పాపం... గుర్నాధం ఓడిపోయాడు. ఘోరాతిఘోరంగా ఓడిపోయాడు. కలలో కూడా వూహించని పరిణామానికి విస్తుపోయారు జనమంతా...

ఎంత ఆలోచించినా యిలా ఎందుకు జరిగిందో ఎవరికీ అర్థంకాలేదు... గుర్నాధం గెలిస్తే డీలర్‌షిప్ రద్దయిపోతుందనీ - అంత ఉదారంగా చౌకడిపో సరుకులు యిచ్చేవాళ్లు ఎవ్వరూ దొరకరనీ రాజకీయ పార్టీలు చేసిన ప్రచారం ఫలించిందని మాత్రం గుర్నాధానికి ఇప్పటికీ తెలియదు. ●